యూనిట్ I

# 1. దుందుభి

**- గంగాపురం హనుమచ్ఛర్మ**

## ఆలోచించండి - చెప్పండి



### ప్రశ్నలు

1. పై చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఏమేం కనిపిస్తున్నాయి?
2. మీరు చూసిన ఇలాంటి దృశ్యం పై మీ అనుభూతిని చెప్పండి.
3. నదిలో నీటి వరద ఎలా ఉంటుందో ఊహించి చెప్పండి.


### ఉద్దేశం

పర్యావరణంలో భాగంగా నది ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ, నదీ ప్రవాహ సౌందర్యాన్ని, ప్రయోజనాలను తెలియజేయడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

**ఈ పాఠ్యాంశం గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన 'దుందుభి' కావ్యం లోనిది.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.




ప్రవహింతువా దుందుభీ
మాసీమ
పాలయేఱుగ దుందుభీ
చిరుగాలి కెరటాల
పొరలెత్తు అలలతో
దరులంటు అమృత శ్రీ
కరములౌ జలముతో
గిరులంటి, వాని ని
ర్ఘరులంటి, పైపైని
దరులంటి, జాజి క్రొ
వ్విరుల వన్నియలూని .
... ప్రవహింతువా..

## దుందుభి నది

రంగారెడ్డి జిల్లాలోని అనంతగిరి కొండల్లో పుట్టి 'మహబూబ్‌నగర్' జిల్లా గుండా ప్రవహించి నల్గొండ జిల్లాలో కృష్ణానదిలో కలుస్తుంది. ఇది కృష్ణానదికి ఉపనది. దీనికి 'డిండి' అని వ్యవహార నామం. ఈ నది ప్రస్తావన స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండంలో గిరి ప్రదక్షిణ కల్పంలో ఉంది. ఈ నదీ తీరంలో దుందుభీశ్వరుడు వెలసినందు వల్ల "దుందుభి" అనే పేరు వచ్చింది.

© SCERT Not to be republished



చరియసందుల బుట్టి,
చారలై కనుపట్టి
చీమ యూటగ మారి,
చెలగి ధారల బారి,
వడిగొనుచు గుమిగూడి,
వాః ప్రవాహమ్ములై,
నురుగులై తరగలై
నునులేత మెరుగులౌ
పావనానంతగిరి ప్రకృతిసీమల నుండి
స్వాదు పానీయ సంపదలతో బొదలుచును
ప్రవహింతువా....

వల్మీక సుషిరాల వారి ధారల ముంచి,
క్రొన్నాగు పడగలకు క్రొత్త భంగిమనేర్పి,
చీమ పిండుల నలల జేర్చి తెప్పున దేల్చి,
గిజిగాని గూండ్లెల్ల గజిబిజిగ నొనరించి
ప్రవహింతువా ........

© SCERT not to be republished


నీ చేతి చలువలకె నేల పులకింపంగ,
తట భూజముల నెక్కి తద్భవానందాన
ఖగపాలికల రుతులు కలసి స్వస్తులు బల్క,
పొగడ పూవులు దాల్చి, పొంగి పొంగి గమించి,
ఇసుక దిబ్బల దూరి బుసగొట్టి బుసగొట్టి,
కంకణమ్ముల గలంగలల ముంజేతులటు
గండశిలలకు దాకి గమకమ్ములంబల్కి,
ప్రవహింతువా .......

స్నిగ్ధ జటాపంక్తి చిమ్మురూపము దాల్చి,
పరుసవేదీశ్వరుని పాదాలు చుంబించి,
'దేవసేన' గ మారి దేదీప్యమానవై,
కావి వన్నియ దాల్చి కన్నె తబిసిగమారి
ప్రవహింతువా ....

జారు బిందువులెల్ల జామీ ఫలమ్ములై,
తరలు తరగలవెల్ల తాంబూల దళములై
ఇరు కెలంకులపాయ లిక్షు దండంబులై
కదలు భంగిమలెల్ల కదళీవనమ్ములై
ప్రవహింతువా.....

**పరుసవేదీశ్వరుడు**

మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలోని **మీనాంబరంలో** ఉన్న 'ఈశ్వరుణ్ణి' పరుసవేదీశ్వరుడు అంటారు. ఈ ప్రాంతంలో దుందుభి నదిని **'దేవసేన'** అని పిలుస్తారు.



© SCERT not to be republished

## కవి పరిచయం



గంగాపురం హనుమచ్ఛర్మ

కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు అయిన గంగాపురం హనుమచ్ఛర్మ గారు మహబూబ్‌నగర్ జిల్లా కలువకుర్తి మండలం వేపూరులో 1925లో జన్మించారు. వీరు సంస్కృతాంధ్ర, హిందీ, ఉర్దూ భాషలలో, వేద వేదాంగ విద్యలలో ప్రవేశం కలవారు. ఋగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం) పద్య, గేయ ఖండికలను రచించారు. మల్కిభరామ, గోపన అనేవి వీరి ఇతర రచనలు. అస్పృశ్యతా నివారణ కోసం విశేషంగా కృషి చేశారు. అట్టడుగు వర్గాల విద్యాబోధనతోపాటు వారికి హాస్టలు వసతి కోసం శ్రమించారు. గ్రంథాలయ, భూదాన, సర్వోదయ ఉద్యమాలలో పాల్గొన్నారు. సమాజహితం కోసం చివరిశ్వాస వరకు పరితపించిన మహానుభావుడు. చక్కని భావం, చిక్కని భాష సొగసైన నడకతో వీరి రచన సాగుతుంది. వీరు 1996లో స్వర్గస్థులైనారు.

### ప్రక్రియ – గేయకవిత

లయకు ప్రాధాన్యం ఇస్తూ మాత్రాఛందస్సులో సాగే రచన గేయకవిత. ఇది పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. ఇందులో పల్లవి, చరణాలు అనే విభాగాలు ఉంటాయి.

©SCERT not to be republished

## సారాంశం

ఓ దుందుభీ! పాలయేరువై మా ప్రాంతాల్లో ప్రవహిస్తావా !

చిరుగాలి అలలతో కలగలసి అమృతం వంటి నీటిబిందువులతో ఒడ్డులను ఒరుసుకుంటూ, కొండలను తాకి, అక్కడి సెలయేళ్ళతో కలసి చెట్ల అంచుల మీదుగా జాజిపూల కొమ్మల అందాలను అద్దుకొని, ఓ దుందుభీ! పాలయేరులా ప్రవహించు.

కొండచరియల్లో పుట్టి, సన్నని చారలై కనిపించి, సన్నని ఊటగా మారి, ధారలై చెలరేగి, వడివడిగా నురగలతో అలలతో, లేలేత తళుకులతో దట్టమైన ప్రవాహమై, పవిత్రమైన అనంతగిరి కొండలనుండి బయలుదేరి రుచిగల తాగు, సాగు నీటిని అందిస్తూ, దుందుభీ! పాలయేరులా ప్రవహించు.

పుట్టల రంధ్రాలను నీటి ధారలతో ముంచి, కోడెనాగులకు కొత్త నాట్యం నేర్పి, చీమలదండులను అలలపై తెట్టుగా తేల్చి, గిజిగాని గూళ్ళను చిందరవందర జేసి, ఓ దుందుభీ! పాలయేరులాగా ప్రవహించు.

నీ చేతి చలువకు నేలతల్లి పులకింపగా ఒడ్డున గల వృక్షాలను తాకుతూ, ఆనందంతో కిలకిలారావాలు చేసే పక్షులకు స్వస్తి వచనాలు పలుకుతూ, పొగడపూలు ధరించి ఉప్పొంగి సాగుతూ, ఇసుకదిబ్బలనుండి హొరెత్తుతూ, ముంజేతి కంకణాల, గండరాళ్ళను తాకి సంగీత గమకాలు సృష్టిస్తూ, ఓ దుందుభీ! పాలయేరులా ప్రవహించు.

మనోహరమైన తెల్లని జడల్లాగా మోహన రూపం ధరించి, పరుసవేదీశ్వరుని పాదాలను తాకి 'దేవసేన'గా మారి, కాషాయ వస్త్రాలు ధరించి, తపస్సు చేసే కన్నెగామారి, దుందుభీ! పాలయేరులా ప్రవహించు.

జాలువారే నీ నీటి బిందువులు జామపండ్లుగా, ముందుకు సాగే అలలు తమలపాకులుగా, రెండు వైపులా పాయలు చెరకుగడలుగా, నీ నడక తీరులు అరటితోటలుగా వెల్లివిరుస్తూ, ఓ దుందుభీ! పాలయేరులా ప్రవహించు.

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. 'నదులు జీవనాధారాలు' దీన్ని సమర్థిస్తూ, మీ అభిప్రాయం చెప్పండి.
2. దుందుభీనది ప్రవహించే తీరంలోని ప్రకృతి దృశ్యాలను గురించి సొంతమాటల్లో చెప్పండి.
3. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నదుల కాలుష్యాన్ని తొలగించడానికి ఏం చేయాలో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. కింద ఇచ్చిన వాక్యభావాలకు సరిపోయే గేయపాదాలను గుర్తించి రాయండి.**

(అ) చెట్లను తాకి, జాజిపూలు రంగులద్దుకొని ప్రవహిస్తావా ?

..............................................................................................

(ఆ) పుట్ట రంధ్రాలను ముంచుతూ ప్రవహిస్తావా?

..............................................................................................

(ఇ) ఇరుకైన దారుల వెంట చెరుకు రసధారలై ప్రవహిస్తావా?

..............................................................................................

**2. కింది పేరాను చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సరిపోయే జవాబు గుర్తించండి.**

తాగునీటి నాణ్యత విషయంలో భారతదేశం 120వ స్థానంలో ఉంది. ప్రతి సంవత్సరం 37.7 మిలియన్ల మంది ప్రజలు కలుషితమైన నీటివల్లే రోగాలబారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలా రోగాల బారిన పడినవారి కోసం ప్రభుత్వం 6,700 కోట్లు ఖర్చు పెడుతోంది. ఈ వాస్తవాలను 'వాటర్ ఎయిడ్' అనే స్వచ్ఛంద సంస్థ వెలుగులోకి తెచ్చింది. భారతదేశంలోని అంటువ్యాధుల్లో 21 శాతం కలుషితమైన నీటివల్లే వ్యాపిస్తున్నాయని ప్రపంచవ్యాప్త నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. ఏటా దాదాపు 15 లక్షల మంది శిశువులు కాలుష్యపు నీటివల్లే కన్నుమూస్తున్నారు. భూగర్భజలాలలో ఫ్లోరైడ్, నైట్రేట్, ఐరన్, ఆర్సెనిక్‌లు అధిక మోతాదులో ఉంటున్నాయి. పొలాల్లో రసాయనిక ఎరువులను విచక్షణ లేకుండా వాడడం, పరిశ్రమలనుండి వెలువడే వ్యర్థ పదార్థాలను నదుల్లో కలపడం నీటి కాలుష్యానికి ప్రధాన కారణాలు.

(అ) తాగు నీటి నాణ్యత విషయంలో భారతదేశం ఏ స్థానంలో ఉంది? ( )

(ఎ) 125 (బి) 120 (సి) 121 (డి) ఏదీకాదు

(ఆ) ప్రతి సంవత్సరం 37.7 మిలియన్ల ప్రజలు ఎందుకు రోగాల బారిన పడుతున్నారు? ( )

(ఎ) వాయుకాలుష్యంవల్ల (బి) ధ్వని కాలుష్యంవల్ల

(సి) నీటి కాలుష్యంవల్ల (డి) వాతావరణ కాలుష్యంవల్ల

© SCERT not to be republished

(ఇ) ప్రభుత్వం 6,700 కోట్లు ఎందు కోసం ఖర్చు చేస్తోంది? ( )

(ఎ) రోగాల బారిన పడిన వారికోసం (బి) మంచినీటికోసం

(సి) ఆరోగ్యవంతుల కోసం (డి) ఏదీ కాదు

(ఈ) 'వాటర్ ఎయిడ్' స్వచ్ఛంద సంస్థ చేసిన కృషి ఏమిటి? ( )

(ఎ) జనాభా కష్టాలు తెలపటం (బి) నిరక్షరాస్యుల వివరాలు తెల్పడం

(సి) అడవులు నరకటం వల్ల నష్టాలు తెలపడం (డి) నీటి కాలుష్యం వల్ల కలిగే నష్టాలు తెలపడం

(ఉ) భూగర్భ జలాలలో ఏవి అధిక మోతాదులో ఉన్నాయి? ( )

(ఎ) ఫ్లోరైడ్, నైట్రేట్, ఆక్సిజన్, ఆర్సెనిక్ (బి) ఫ్లోరైడ్, ఆర్సెనిక్, జింక్, సల్ఫర్

(సి) నైట్రేట్. ఐరన్, ఆర్సెనిక్, ఫ్లోరైడ్ (డి) నైట్రేట్, ఫ్లోరైడ్, జింక్, ఆక్సిజన్

(ఊ) కలుషితమైన నీటి వల్ల ఎలాంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రపంచవ్యాప్త నివేదికలు చెపుతున్నాయి?

(ఎ) దీర్ఘకాల వ్యాధుల (బి) కలరా వ్యాధులు (సి) కొత్త వ్యాధులు (డి) అంటు వ్యాధులు

**3. కింది పేరాను చదవండి. దీన్ని ఆధారం చేసుకొని నదులకు సంబంధించిన వివరాలను పట్టికలో రాయండి.**

మన రాష్ట్రంలో ప్రవహించే నదులలో గోదావరి, కృష్ణ ముఖ్యమైనవి. కృష్ణానది మన రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాలో అడుగుపెడుతుంది. ఈ నదీతీరంలో శ్రీశైలం, విజయవాడ వంటి పుణ్యక్షేత్రాలు నాగార్జునసాగర్, అమరావతి వంటి చారిత్రక ప్రదేశాలున్నాయి. ఇది హంసలదీవి దగ్గర బంగాళాఖాతంలో కలుస్తుంది. గోదావరినది ఆదిలాబాదు జిల్లాలోని బాసరవద్ద ప్రవేశిస్తుంది. ఈ నది తీరంలో బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలు, రాజమండ్రివంటి చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో గోదావరి 770 కిలోమీటర్లు ప్రవహిస్తే కృష్ణానది 720 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. గోదావరిపైన ధవళేశ్వరం, పోచంపాడు వద్ద ఆనకట్టలు కట్టారు. కృష్ణానదికి తుంగ, భద్ర, మూసి అనే ఉపనదులు ఉన్నాయి. అట్లే గోదావరినదికి మంజీర, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి అనే ఉపనదులు ఉన్నాయి.

| నది పేరు | ముఖ్యమైనప్రాంతాలు | ఉపనదులు | నదిపొడవు | ఆనకట్టలు |
|---|---|---|---|---|
| | | | | |

© SCERT not to be republished

**4. కింది గేయపాదాలు చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

పావనానంతగిరి ప్రకృతి సీమలనుండి
స్వాదుపానీయ సంపదలతో బొదలుచును
ప్రవహింతువా ....

**ప్రశ్నలు**

(అ) పై పాదంలో "పవిత్రం" అనే అర్థం ఇచ్చే పదం ఏది?

(ఆ) పై గేయంలో ప్రస్తావించిన కొండలేవి?

(ఇ) "స్వాదు పానీయ సంపదలతో ప్రవహింతువా"! అనే వాక్యానికి భావం ఏమిటి?

(ఈ) ప్రవహింతువా? అని కవి ఏ నదిని సంబోధిస్తున్నాడు?

**5. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

(అ) కవి నదిని వర్ణించిన తీరును సొంతమాటల్లో రాయండి.

(ఆ) నది ప్రవహించినప్పుడు ఏవేవి ఎలా స్వాగతం పలికాయి?

(ఇ) కొండచరియల్లో పుట్టిన నది ఏయే ప్రాంతాల్లో ఎలా ప్రవహించింది?

## III. స్వీయరచన

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. తమ సీమలో నది ప్రవహించాలని కోరడంలో కవి ఉద్దేశం ఏమిటి?
2. పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
3. పాఠంలో మీకు నచ్చిన గేయ భాగాన్ని వివరిస్తూ రాయండి.
4. పర్యావరణంలో నదుల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ పది వాక్యాలు రాయండి.

## IV. పదజాలం

**1. కింది పదాలలో భూమితో సంబంధం ఉన్న పదాలను వేరు చేసి వాటితో వాక్యాలు రాయండి.**

సీమ, వన్నె, పావనము, దరి, వారి, ఖగము, వల్మీకం, అమృతం, గిరి.

ఉదా : సీమ = ప్రాంతం

(అ) పలనాటి సీమలో బ్రహ్మనాయుడు చాపకూడుతో సమతను నేర్పాడు.

**2. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి. వాటితో మరో వాక్యం రాయండి.**

(అ) <u>వల్మీకంలో</u> పాములుంటాయి.

(ఆ) అడవిలో <u>భూజములను</u> నరకడం వల్ల కరువుకాటకాలు వస్తాయి.

(ఇ) ప్రార్థనలో విద్యార్థులు <u>పంక్తులలో</u> నిలబడతారు.

(ఈ) మంచు కరిగి <u>వారి</u> గా మారుతుంది.

© SCERT not to be republished

**3. కింది పదాలకు సమానార్థక పదాలను పట్టికలో గుర్తించి రాయండి.**

(అ) నీరు = ....................    (ఈ) కొండ = ....................
(ఆ) అమ్మ = ....................    (ఉ) చెట్టు = ....................
(ఇ) చేయి = ....................    (ఊ) అలలు = ....................

| | | | |
|---|---|---|---|
| జనని | వారి | కెరటాలు | భూజము |
| హస్తం | తల్లి | కరం | జలం |
| గిరి | వృక్షం | పర్వతం | తరంగాలు |

## V. సృజనాత్మకత

మీ ప్రాంతంలో ప్రవహించే వాగు / ఏరు/కాలువ/ నదిని వర్ణిస్తూ కవిత / గేయం రాయండి.

(లేదా)

బహుళ ప్రయోజనాలను చేకూర్చే నదుల ప్రాముఖ్యం వివరిస్తూ, ఆ నదులు కాలుష్యం బారిన పడకుండా చూడడానికి ప్రజలను చైతన్యపరుస్తూ ఒక కరపత్రం తయారుచేయండి.

## VI. ప్రశంస

దుందుభి గేయంలో కవి నదిని అద్భుతంగా వర్ణించాడు. ఇది ఆసక్తి కలిగించేలా ఉంది కదా! దీనివల్ల నీకు ఎలాంటి ఆసక్తి కలిగిందో వివరిస్తూ ఒక వ్యాసం రాసి గోడ పత్రికలో ప్రదర్శించండి.

(లేదా)

పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మీ మిత్రుడు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందాడు. అతణ్ణి అభినందిస్తూ గ్రీటింగ్ కార్డు రూపొందించి ప్రదర్శించండి.

## VII. భాషను గురించి తెలుసుకుందాం !

**1. కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

ఉదా : విద్యార్థి = విద్యా + అర్థి – సవర్ణదీర్ఘసంధి

1. గిరులంటి,    2. కావ్యేతర,    3. విశాలాక్షి,    4. బసవేశ్వరుడు,

5. మంత్రాలయం,    6. గర్వోక్తి    7. భూజములనెక్కి,    8. రాజర్షి

©SCERT not to be republished

**2. కింది పదాలను కలిపి, సంధి పేరు రాయండి**

(అ) రామ + ఈశ్వరము = .................... ....................

(ఆ) జలజ + ఆకరము = .................... ....................

(ఇ) మాస + అంతరము = .................... ....................

(ఈ) మహా + ఋషి = .................... ....................

(ఉ) రామ + ఆలయం = .................... ....................

(ఊ) జ్ఞాన + ఈశ్వరుడు = .................... ....................

(ఋ) మీన + అక్షి = .................... ....................

(ౠ) కూప + ఉదకము = .................... ....................

(ఎ) మధుర + అశ్రువులు = .................... ....................

(ఏ) లేఖ + ఆవళి = .................... ....................

**3. కింద యిచ్చిన పద సమూహం నుంచి మొదట సవర్ణదీర్ఘ సంధికి, ఉత్వ సంధికి చెందిన పదాలను తరువాత గుణసంధికి చెందిన పదాలను ఎన్నుకొని విడదీసి సంధి పేరు, సూత్రం రాయండి.**

సజ్జనావళి, మహోగ్రము, వక్రోక్తి, ఉపేంద్రుడు, వేదోక్తి, వారాంతము, భోజనానంతరం,

గిరులంటి, బిరుదాంకితులు, రాజేశ్వరి, శీతోష్ణము, మీరుంటే, పొరలెత్తు

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

1. మీ ప్రాంతంలోని నదుల పేర్లు సేకరించి, వాటి తీరంలో వెలసిన సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను వాటి ప్రత్యేకతలను రాయండి.

**నేనివి చేయగలనా ?**

1. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడగలను, సమర్థిస్తూ అభిప్రాయాలు చెప్పగలను — ఔను / కాదు
2. చదివిన విషయాన్ని పట్టిక రూపంలో రాయగలను. — ఔను / కాదు
3. కవి ఉద్దేశాన్ని, సారాంశాన్ని సొంత మాటల్లో రాయగలను. — ఔను / కాదు
4. నదీ ప్రవాహాన్ని వర్ణించగలను, కరపత్రం తయారు చేయగలను. — ఔను / కాదు

మట్టి తవ్వగానే నీళ్ళు కనిపించవు. తవ్వగా తవ్వగా ఊట బయట పడుతుంది.
అలాగే జ్ఞానం కూడా శోధన, సాధనలతోనే వస్తుంది.